**OFFICE OF THE**
**COMMISSIONER & DIRECTOR OF AGRICULTURE,**
**TELANGANA, HYDERABAD.**

**No.Prtg.(3)Adv.News/2020** **12-06-2020**

The Copy of News Items appeared in the daily news paper on 12-06-2020 are hereby communicated for your kind information.

## 12.06.2020-Sakshi-Gadwal:

Clipping-24

# రైతుకు రుణ విముక్తి



- మొదటి విడత డబ్బులు విడుదల చేసిన ప్రభుత్వం
- రైతుల అకౌంట్లలో జమ చేసేందుకు వివరాల సేకరణ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్
- మొదటి విడతలో రూ.25వేలు జమ



మద్దూర్ మండలం మన్నపూర్‌లో రైతుల ఆధార్ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్న అధికారులు (ఫైల్)

నారాయణపేట: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.లక్షలోపు వ్యవసాయ రుణాల మాఫీలో భాగంగా తొలి విడతలో రూ.25 వేల లోపు రైతు రుణాల మాఫీకి రూ.1,200 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. గత 15 రోజులుగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రైతులకు రూ.25 వేల లోపు ఉన్న వారికి రుణ మాఫీ డబ్బులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఒకే రైతుకు వివిధ బ్యాంకుల్లో అకౌంట్ ఉండడం, అకౌంట్ నంబర్ బ్లాక్ కావడం, ఐఎఫ్ఎస్ కోడ్ లేకపోవడం, రైతుల వివరాలు తప్పుగా ఉండటంతో పలువురి రైతులకు రూ.25 వేల రుణమాఫీ ఖాతాల్లో జమకాలేదు. ఉమ్మడి జిల్లాలో వివిధ బ్యాంకులకు సంబంధించి 130 బ్రాంచీలు ఉన్నాయి. ఏ రైతు ఏ బ్యాంకులో రుణం ఎంత తీసుకున్నారనేది ఆధార్‌కార్డు లింక్‌చేయడంతో బట్టబయలు కానుంది.

### రైతు రుణ ఖాతాలకు ఆధార్ లింకు

ఆధార్ కార్డు లింకు లేకపోవడంతో రైతులకు అందాల్సిన రూ.25 వేల రుణమాఫీకి కాస్తా ఆటంకం కలిగినట్లయింది. ఈమేరకు అధికారులు అర్హులైన రైతుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌జిల్లాలో ఆధార్ లింక్ వివరాలను పరిశీలిస్తే.. నారాయణపేట జిల్లాలో 1,06,534 మంది రైతులు ఉండగా 7,581 మంది రైతులకు సంబంధించి ఆధార్‌కార్డు లింక్ కాలేదు. వాటిని గత వారం రోజులుగా ఏఈఓలు గ్రామాల్లోకి వెళ్లి రైతుల ఆధార్‌కార్డు వివరాలను సేకరించి నమోదుచేయడంతో వంద శాతం పూర్తి చేసినట్లయింది. అదే విధంగా వనపర్తి జిల్లాలో 91,640 మంది రుణాలు తీసుకున్న రైతులు ఉండగా ఆధార్‌కార్డు లింకు లేని 3,102 మంది రైతుల్లో 3,097 మంది రైతులవి లింక్ చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో రుణాలు తీసుకున్న 95,207 మంది రైతుల్లో 2,420 మంది ఆధార్‌లింక్ లేకపోవడంతో 2,395 మంది ఆధార్‌కార్డులను లింక్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 1,18,880 మంది రైతులకు గాను 5,891 మంది రైతులకు సంబంధించి ఆధార్‌కార్డు లింకు చేయకపోవడంతో అందులో 5,806 మందివి చేశారు. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లాకు సంబంధించి 1,77,086 మంది రైతులకు గాను 15,079 ఆధార్‌లింకు పెండింగ్‌లో ఉండగా.. 14,513 మందివి ఇటీవల లింక్ చేశారు.

### ఒక కుటుంబానికి రూ.లక్ష వరకే మాఫీ

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 2014 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2018 డిసెంబర్ 11 మధ్య పంట రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీకి అర్హులు. ఆ తేదీల మధ్య వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతుల వివరాలను అధికారులు సేకరించారు. రైతులు తమ కుటంబంలో పట్టాపాసు పుస్తకాలపై వివిధ బ్యాంకుల్లో పొందిన రుణాల్లో ప్రభుత్వం రూ.లక్ష వరకే మాఫీ చేసేందుకు చర్యలు చేపట్టింది. అందుకే ఏ బ్యాంకులో రుణం తీసుకున్నరనే దాన్ని తేల్చేందుకే జిల్లా వ్యవసాయశాఖ రైతు కుటుంబాలకు సంబంధించి ఆధార్‌కార్డులను లింక్ చేసేశారు. రైతులు తమ భూములను విభజించి కుటుంబసభ్యులపై పట్టా పాసుపుస్తకాలు చేయించిన భార్య,భర్తలకు కలిపి రూ.లక్ష రుణం దాటితే వారికి లక్ష వరకే మాఫీ వర్తించేలా చర్యలు చేపట్టారు. ఆధార్‌లింకు ఉన్నవారికి 50 శాతం పైగా రూ. 25 వేలు రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ డబ్బులు ఖాతాలో జమ అయినట్లు అధికారులు చెబుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో రుణాలు పొందిన రైతుల వివరాలు**

| జిల్లా | రైతులు | రూ.25 వేలలోపు | ఆధార్ లింకు శాతం |
|---|---|---|---|
| నారాయణపేట | 1,06,534 | 10,357 | 100 |
| వనపర్తి | 91,495 | 10,639 | 99 |
| జోగులాంబ గద్వాల | 95,207 | 8,758 | 98 |
| మహబూబ్‌నగర్ | 1,18,880 | 16,599 | 98 |
| నాగర్‌కర్నూల్ | 1,77,086 | 19,952 | 96 |
| మొత్తం | 5,89,202 | 66,305 | |